క్లుప్తంగా

గోడౌన్స్ రోడ్డులో దుర్గంధం



గోడౌన్ వద్ద రోడ్డు మార్జిన్‌లో ఉన్న చెత్త

ఏలూరు రూరల్ : ఏలూరు తంగెళ్లమూడి ఎఫ్‌సీఐ గోడౌన్స్ రోడ్డు తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. రోడ్డపక్క పేరుకుపోయిన చెత్త, చెదారం వల్ల పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. దీనికి తోడు వర్షపునీరు, పందుల సంచారంతో మురుగుకూపంలా తయారైంది. కార్పొరేషన్ పారిశుధ్యం సిబ్బంది నగరంలో సేకరించిన చెత్తను తెచ్చి ఇక్కడే పోస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. పాదచారులు, వాహనచోదకులు ఈ మార్గంలో ముక్కుమూసుకొని రాకపోకలు సాగించాల్సి వస్తోంది. సమస్య పరిష్కరించాలని నగర అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోలేదని స్థానికులు యడ్లపల్లి శివ ఆవేదన వ్యక్తం చేశారు.

నోట్‌బుక్స్ పంపిణీ



నోట్ పుస్తకాలు అందించిన దృశ్యం

ఏలూరు రూరల్ : స్థానిక వైఎస్సార్ కాలనీ మండల పరిషత్ పాఠశాలలో మంగళవారం నోట్ బుక్స్ పంపిణీ జరిగింది. ప్రధానోపాధ్యాయురాలు పి.జయలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఏలూరు స్మార్ట్‌సిటీ లయన్స్ క్లబ్ జెడ్‌సీ దిడ్ల యాంజిలో, ట్రేస్ స్వచ్ఛంద డైరెక్టర్ దిడ్ల స్వర్ణకుమారి, యూటీఎఫ్ ఏలూరు జిల్లా అధ్యక్షుడు షేక్ ముస్తఫాఅలీ చేతుల మీదుగా బాలబాలికలకు ఉచితంగా నోట్స్ బుక్స్ అందజేశారు. ఉపాధ్యాయులు పి.లక్ష్మి, సూర్యకుమారి, జీజేఏ స్టీవెన్ పాల్గొన్నారు.

అసంబద్ధ ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రతి పాఠశాలలో కిచెన్ గార్డెన్లు పెంచాలని, మొక్కలు నాటుతూ ఫొటోలను మెయిల్ చేయాలని మధ్యాహ్న భోజన పథకం డైరెక్టర్ ఇచ్చిన ఉత్తర్వులను వ్యతిరేకిస్తున్నామని ఏపీటీఎఫ్ నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తర్వుల్లో మొక్కలు ఎవరు నాటాలి? ఉపాధ్యాయులు పారలతో పని చేయాలా లేక విద్యార్థులతో చేయించాలా లేక కూలి మనుషులతో చేయించాలా అనే విషయంలో స్పష్టత ఇవ్వలేదని పేర్కొన్నారు. విద్యార్థులతో చేయిస్తే ఉపాధ్యాయులను శిక్షిస్తారని, ఉపాధ్యాయులే చేయాలా? అనే విషయాన్ని విద్యాశాఖ స్పష్టం చేయాలని కోరారు. పాఠశాలల్లో మొక్కల పెంపకం అనే విషయం సంతోషదాయకమేనని, ఉపాధ్యాయులను చులకనగా చూస్తూ డైరెక్టర్ ఇచ్చిన ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బీఏ సాల్మన్ రాజు, రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎస్‌కే రంగావలి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తాళ్లూరి రామారావు, బి.రెడ్డి దొర డిమాండ్ చేశారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

పెదపాడు: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని తహసీల్దార్ వి. భావనారాయణ, ఎస్సై శుభశేఖర్ తెలిపారు. పెదపాడు తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ ఎస్సైలు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణ, పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని ఆరోగ్యానికి హాని కలిగించే కోళ్ల వ్యర్థాల అక్రమ నిరోధానికి కృషి చేయాల్సిన అవసరముందని చెప్పారు. చేపల చెరువుల యజమానులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజల ఆరోగ్యానికి పెనుముప్పు కలిగించే కోళ్ల వ్యర్థాలను రవాణా చేయడం వాటిని చేపలకు మేతలుగా వినియోగిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. వ్యర్థాలను రవాణా చేస్తున్న వాహనాలపై కేసు నమోదు చేసేందుకు పోలీసులకు, రెవెన్యూ అధికారులు సహకారం అందించాలని సూచించారు.

రుణ పత్రాల జారీలో అంకెల గారడీ

కౌలు రైతుల సంఖ్యను ఎక్కువగా చూపుతున్న ప్రభుత్వం



చాటపర్రులో కౌలు రైతులకు రుణ అర్హత పత్రాలు అందిస్తున్న అధికారులు

ఏలూరు రూరల్ : టీడీపీ ప్రభుత్వం రుణార్హత పత్రాల జారీలో అంకెల గారడీ చేస్తోంది. కౌలురైతుల సంఖ్య ఎక్కువ చేసి చూపుతోంది. అందరికీ రుణాలు ఇస్తామంటూ ప్రచారం చేసుకుంటోంది. వ్యవసాయ రంగానికి గత ప్రభుత్వం కంటే ఎక్కువ చేశామని గొప్పలు చెప్పుకోవాలని ఆరాటపడుతోంది. ఐదేళ్ల క్రితం ఏలూరు అర్బన్, రూరల్ గ్రామాల్లో కౌలురైతుల సంఖ్య 1600. వైఎస్సార్ సీపీ హయాంలో రైతాంగాన్ని ప్రోత్సహించడంతో కౌలు రైతుల సంఖ్య 2500కు చేరింది. మొత్తంగా ఏలూరు అర్బన్ పరిధి చొదిమెళ్ల, తంగెళ్లమూడి, కొమడవోలు, వెంకటాపురం, పోణంగిలో 1300, రూరల్ మండల గ్రామాలైన కాట్లంపూడి, జాలిపూడి, మల్కాపురం, మాదేపల్లి, చాటపర్రులో మరో 1200 మంది కౌలు రైతులు ఉన్నారు. ప్రస్తుత టీడీపీ ప్రభుత్వం రైతుల సంఖ్యను 3,200గా చూపుతోంది. వీరిలో కనీసం 2,900 మందికి రుణ అర్హత పత్రాలు పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించింది. దీంతో అధికారులు టార్గెట్ పూర్తి చేసేందుకు నానా తంటాలు పడుతున్నారు.

వైఎస్సార్ సీపీ హయాంలో..

గతేడాది ఏలూరు రూరల్ మండలంలో 2,200 మంది రైతులు రుణ అర్హత పత్రాలు అందుకున్నారు. వీరందరికీ ప్రభుత్వమే పూచీకత్తుగా ఉండి, పలు బ్యాంకుల నుంచి సుమారు రూ.23.61 లక్షలు రుణం అందించింది. దీనికితోడు 10 రైతుల సంఘాల సభ్యులు సబ్సిడీపై ట్రాక్టర్లు, యంత్రాలు, టార్పాలిన్లు, స్ప్రే పరికరాలు అందుకున్నారు. ఇక వైఎస్సార్ రైతు భరోసా పథకం ద్వారా రూ.207.21 లక్షలు రైతుల ఖాతాల్లో జమైంది.

రుణాలు మంజూరయ్యేనా?

పత్రాలు అందుకున్న వారందరూ అప్పుకోసం బ్యాంకులకు వెళితే మేనేజర్లు మంజూరు చేస్తారో లేదో అన్న అనుమానం సర్వత్రా వ్యక్తమవుతోంది. ఎందుకంటే ఇప్పటికే డిఫాల్టర్స్ పెరిగిపోయారంటూ చాటపర్రు, ఏలూరులోని పలు బ్యాంకుల మేనేజర్లు రైతులకు రుణాలు ఇవ్వడం లేదు. మరి కొందరికి రూ.15 వేలు నుంచి రూ.20 వేలు వరకు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం ఎకరానికి రూ.35 వేలు నుంచి రూ.45 వేల వరకు రుణం ఇవ్వాలి. కాని ఇప్పుడు టీడీపీ ప్రభుత్వం సాగుదారులు కానివారికి కూడా పత్రాలు ఇవ్వడం వల్ల నిజమైన రైతుకు అప్పు ఇచ్చే పరిస్థితి ఉండదంటున్నారు. ఇదే జరిగితే ఐదేళ్ల క్రితం టీడీపీ హయాంలో జరిగినట్టు మళ్లీ రైతన్న సాగు కోసం అప్పులోళ్ల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన దుస్థితి ఏర్పడుతుందని పలువురు పేర్కొన్నారు.

“

మోసం చేయడం చంద్రబాబు నైజం



రైతాంగానికి మేలు చేశామని చెప్పేందుకు టీడీపీ ప్రభుత్వం ఇలాంటి జిమ్ముక్కులు చేస్తుంది. గతంలోనూ ఇలాగే రుణమాఫీ పేరుతో చంద్రబాబు రైతులను మోసం చేసి ముఖ్యమంత్రి అయ్యారు. ఈ ఐదేళ్ల కూడా ఇలాగే అన్ని వర్గాల ప్రజలనూ మోసం చేసి పాలన చేస్తారు. వైఎస్సార్ సీపీ హయాంలో రైతులకు పెద్దపీట వేశారు. ఏ రాష్ట్రంలో లేనివిధంగా పథకాలు అమలు చేసి వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేశారు.

– మంచెం మైబాబు, ఏఎంసీ మాజీ చైర్మన్, మాదేపల్లి

టార్గెట్ పూర్తి చేస్తాం



ఈ ఏడాది ఏలూరు అర్బన్, రూరల్ ప్రాంతాల్లో 2,900 మందికి రుణ పత్రాలు అందించాలని నిర్ణయించాం. ఇప్పటి వరకూ 975 మందికి పత్రాలు అందించాం. సాగుదారులకు బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పించేందుకు కృషి చేస్తాం. ఇప్పటికే రుణగ్రహీతుల జాబితా బ్యాంకులకు అందజేశాం. రైతులు తీసుకునే రుణానికి ప్రభుత్వ పూచీకత్తుగా ఉంటుంది.

– జీవనసంధ్య, ఎంఏఓ

పోలీస్ సంక్షేమానికి పెద్దపీట



దుర్గాదేవికి ఆర్థిక సాయం అందిస్తున్న ఎస్పీ శివకిషోర్

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లాలో పోలీస్ సిబ్బందికి అండగా ఉంటామని ఎస్పీ కొమ్మి ప్రతాప శివకిషోర్ అన్నారు. అనారోగ్య కారణాలతో మృతిచెందిన కానిస్టేబుల్ దాసరి మధుకుమార్ సతీమణి దుర్గాదేవికి ఆర్థిక సాయం జిల్లా ఎస్పీ చేతులమీదుగా ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో మంగళవారం అందజేశారు. ఫ్లాగ్ ఫండ్ నుంచి రూ.25 వేలు, విడో ఫండ్ నుంచి రూ.50 వేలు ఆర్థిక సాయం చెక్కు అదించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ కానిస్టేబుల్ మధుకుమార్ మృతి దురదృష్టకరమని, ప్రభుత్వ పరంగా మృతుని కుటుంబానికి అండగా ఉంటూ, కుటుంబానికి రావాల్సిన రాయితీలు, ఆర్థిక ప్రయోజనాలను సకాలంలో అందేలా చర్యలు చేపడతామని చెప్పారు. కానిస్టేబుల్ మధుకుమార్ కుటుంబంలో అర్హులకు కారుణ్య నియామకం చేసేలా ప్రభుత్వానికి సిఫార్సు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ జి.స్వరూపరాణి, పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆర్ నాగేశ్వర రావు, సిబ్బంది ఉన్నారు.

రోడ్లన్నీ గోతులమయం



నిత్యం రద్దీగా ఉండే అశోక్ నగర్ సెంటర్

గత కొన్ని రోజులుగా కురిసిన వర్షానికి ఏలూరు నగరంలోని రోడ్లపై గుంతలు ఏర్పడ్డాయి. వీటిపై రాకపోకలకు వాహనదారులు, ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. రోడ్డు గుంతల్లో పడి చాలా మందికి ప్రమాదాల బారినపడ్డారు. వన్ టౌన్‌లోని బుద్ధాపార్కు, పాండురంగా థియేటర్ రోడ్డు, బిర్లాభవన్ సెంటర్, టూటౌన్‌లోని పాతబస్టాండ్ ఫ్లై ఓవర్, ఏఎస్ఆర్ స్టేడియం సెంటర్, ఖండ్రిక గూడెం సెంటర్, అశోక్‌నగర్ సెంటర్ ఇలా చెప్పుకుంటూ పోతే అన్ని రోడ్లూ గుంతలమయమయ్యాయి. ముఖ్యమంత్రి చెప్పినట్టు ఆ కాస్త బూడిదనైనా వేసి గుంతలు పూడ్చాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్ / ఏలూరు



పాండురంగా థియేటర్ రోడ్డు ఇలా..



ఖండ్రికగూడెం సెంటరులో ప్రమాదకరంగా..



బుద్ధాపార్కు సెంటర్‌లో ప్రమాదకరంగా ఉన్న గొయ్యి



గోతులుపడి ఊచలు కనిపిస్తున్న పాతబస్టాండ్



ఏఎస్ఆర్ స్టేడియం సెంటర్‌లో ఏర్పడిన గోతులు

ఏలూరులో ఆధార్ శిబిరాలు

ఏలూరు టౌన్: ఆధార్ నమోదు, అప్‌డేట్‌కు ఏలూరు నగరంలో ఈనెల 23 నుంచి 27వ తేదీ వరకు శిబిరాలు నిర్వహిస్తున్నట్టు ఏలూరు నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

ఆధార్ మొబైల్ క్యాంపులు ఇలా..

ఈనెల 24న : తాపీమేస్త్రీ కాలనీ–2 సచివాలయం, హిందూ గర్ల్స్ ఉన్నతపాఠశాల
- ఆర్‌ఆర్‌పేట, ఈదర సుబ్బమ్మదేవీ నగరపాలకోన్నత పాఠశాల
- జీజీహెచ్ ఎదురుగా, సెయింట్ థెరిస్సా ఉన్నత పాఠశాల
- గొల్లాయగూడెం, పంపుల చెరువు, కమ్యూనిటీ హాలు వద్ద
- చోడిదిబ్బ, నరసింహ నగరపాలక పాఠశాల
- తంగెళ్లమూడి శివగోపాలపురం, ఇజ్రాయేల్‌పేట, కమ్యూనిటీ హాల్

ఈనెల 25న : తంగెళ్లమూడి–1 సచివాలయం, ఎఫ్‌సీఐ గోడౌన్, చింతలపూడి రోడ్డు
- అశోక్‌నగర్, రాజీవ్‌గాంధీ పార్క్, సచివాలయం
- 12 పంపుల సెంటర్, గాంధీనగర్ ఉన్నత పాఠశాల
- సత్రంపాడు, జెడ్పీ ఉన్నత పాఠశాల
- పవర్‌పేట, విమలాదేవి నగరపాలక పాఠశాల
- ఎంఆర్‌సీ కాలనీ, సచివాలయం –1

ఈనెల 26న : అశోక్‌నగర్, అశోక్‌వర్ధన్ నగరపాలక పాఠశాల
- బాలయోగి వంతెన, పాములదిబ్బ సచివాలయం
- పోస్టల్ కాలనీ, నగరపాలక పాఠశాల
- 12 పంపుల సెంటర్, విమలాదేవి నగరపాలక పాఠశాల
- యాదవనగర్, సచివాలయం–2

ఈనెల 27న : పత్తేబాద, ఎరుకల కాలనీ సచివాలయం
- మోతేవారితోట, ఎన్‌సీసీ క్యాంటీన్, నైనా టవర్స్ వెనుక
- హనుమాన్‌నగర్, వెంకటాపురం సచివాలయం–5
- గన్‌బజార్, కమ్యూనిటీ హాల్, కొత్తపేట సచివాలయం
- రజకుల పేట, కమ్యూనిటీ హాల్ వద్ద

26న సమస్యల పరిష్కార వేదిక

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏపీఈపీడీసీఎల్ ఆధ్వర్యంలో ఈనెల 26న శుక్రవారం ఏలూరు డివిజన్ పరిధిలోని ఏలూరు రూరల్ సబ్ డివిజన్ కార్యాలయంలో (బాలయోగి సైన్సు పార్కు, అశోక్ నగర్ సబ్ స్టేషన్ వద్ద) విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్టు ఆ సంస్థ ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు జేపీబీ నటరాజన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి కన్స్యూమర్ గ్రీవెన్సెస్ రెడ్రెస్సల్ ఫోరమ్ చైర్ పర్సన్ బి.సత్యనారాయణ, సాంకేతిక సభ్యులు వి.జనార్దనరావు, ఆర్థిక సభ్యులు ఎం శ్రీనివాస్, స్వతంత్ర సభ్యులు ఆర్ సురేంద్ర కుమార్ హాజరవుతారని తెలిపారు.

దివ్యాంగులపై అనుచిత వ్యాఖ్యలు తగవు



ఏఎస్సైకి ఫిర్యాదు చేస్తున్న సంఘం ప్రతినిధులు

భీమడోలు: దివ్యాంగులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన తెలంగాణ ఐఏఎస్ అధికారి స్మిత సబర్వాల్‌ను కఠినంగా శిక్షించాలని కోరుతూ మంగళవారం జిల్లా వికలాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మామిడిపల్లి నాగభూషణం ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద దివ్యాంగులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్మిత సబర్వాల్ వ్యాఖ్యలను వారు తీవ్రంగా ఖండించారు. ఐఏఎస్ అధికారిగా ఉన్నతోద్యోగంలో ఉన్న సబర్వాల్ దివ్యాంగుల పట్ల బాధ్యతరాహిత్యంగా వ్యాఖ్యలు చేసి వారి ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా ప్రకటన చేయడం దారుణమన్నారు. భవిష్యత్తులో ఆమె ఇలాంటి వ్యాఖ్యలు చేయకుండా ప్రభుత్వాలు తగు చర్యలు తీసుకోవాలని నాగభూషణం డిమాండ్ చేశారు. ఏఎస్సై వెంకటేశ్వరరావుకు దివ్యాంగులు ఫిర్యాదు చేశారు.

శిక్షా సప్తాహ్ కార్యక్రమాలు ప్రారంభం



శ్రీరామ్‌నగర్‌లోని స్పెషల్ మున్సిపల్ పాఠశాలలో ఎగిరే విమానాన్ని ప్రదర్శిస్తున్న విద్యార్థులు



నమూనాలను ప్రదర్శిస్తున్న సుబ్బమ్మదేవి స్కూల్ విద్యార్థులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జాతీయ విద్యావిధానం (ఎన్ఈఎస్‌పీ)–2020కు నాలుగేళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఏలూరు నియోజకవర్గంలోని పలు పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ కార్యక్రమాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు పాఠశాలలకు సెలవు కావడంతో రెండో రోజు మంగళవారం కార్యక్రమాలతో ఈ శిక్షా సప్తాహ్ ప్రారంభమైంది. 1వ తరగతి నుంచి భాషపై పట్టు సాధించేందుకు పునాది అభ్యసనం, గణితంలోని సంఖ్యాశాస్త్రం నైపుణ్యాల అభివృద్ధి విజయవంతంగా అమలు చేయడానికి సమాజ భాగస్వాములకు చర్చ ద్వారా అవగాహన కల్పించే కార్యక్రమాలను నిర్వహించారు. విద్యార్థులు తమలోని సృజనాత్మకతను చాటిచెప్పేలా పలు బోధన, అభ్యసన సామగ్రి తయారు చేసి ఆకట్టుకున్నారు. గ్జేవియర్ నగర్‌లోని సెయింట్ గ్జేవియర్ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంఈఓలు 1, 2 రవిప్రకాష్, రూపావతు రంగయ్యలు సందర్శించి విద్యార్థులు చూపిన ప్రతిభను ప్రశంసించారు. శ్రీరామ్‌నగర్లోని స్పెషల్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్ నాగేంద్ర సింగ్ ఆధ్వర్యంలో విద్యార్థులు పాత జవాబు పత్రాలతో దారాలు, స్టాపులర్ ఉపయోగించి 30 నిమిషాల వ్యవధిలో గాలిలో ఎగిరే విమానం తయారు చేసి అబ్బుర పరిచారు. ఈ సందర్భంగా ప్రజలకు రవాణా సౌకర్యాలపై విద్యార్థులకు అవగాహన కలిగించారు. జ్వాలాపహరేశ్వర స్పెషల్ మున్సిపల్ స్కూల్, ఈదర సుబ్బమ్మ దేవి మున్సిపల్ స్కూల్, బాబూఖాన్ గూడెంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలతో పాటు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ కార్యక్రమాలు నిర్వహించారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	00
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	40
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	26
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	37

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	21.45	4820	31
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	21.15	4822	28
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	32
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	28
ఏలూరు – జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	28
ఏలూరు – జీడిమెట్ల వయా ఖమ్మం	21.00	4804	29
ఏలూరు – ఈసీఐఎల్	22.30	4814	29
ఏలూరు – తిరుపతి	16.00	4830	10

ఎర్రకాలువ ఉగ్రరూపం

గణపవరం: ఎర్ర కాలువ ఉగ్రరూపం రోజురోజుకూ పెరుగుతూ గణపవరం మండలం కొందేపాడు గ్రామ ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. గ్రామంలోకి వరదనీరు చేరడంతో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. యర్ర కాలువ లో లెవల్ వంతెన వద్ద నుంచి వరదనీరు గ్రామంలోకి ప్రవేసిస్తుండటంతో ఇసుక బస్తాలతో అడ్డుకట్ట వేశారు. ఎర్ర కాలువలో వరద నీటి మట్టం పెరుగుతుండటంతో ఏ క్షణంగా గ్రామం మీదికి విరుచుకుపడుతుందోనని గ్రామస్తులు బిక్కుబిక్కుమంటున్నారు. ఏటా వర్షాకాలంలో కొందేపాడు గ్రామానికి ముంపుబెడద షరా మామూలుగా మారిపోయింది. భారీ వర్షం కురిసినా, ఎర్ర కాలువ పొంగినా ముందుగా మునిగిపోయేది ఈ గ్రామమే. గణపవరం మండలంలో శివారు గ్రామమైన కొందేపాడు ముంపునకు ముందు, సాగునీటికి వెనుక అన్నట్లు ఉంటుంది. ఎర్ర కాలువ పరీవాహక ప్రాంతాల్లో కొందేపాడు ముందుగా ముంపు బారిన పడుతుంది. ప్రస్తుతం గ్రామంలోని పొలాలన్నీ ముంపు బారిన పడి, నడుములోతు నీటిలో ఉన్నాయి. ఎర్ర కాలువ నీటి ప్రవాహం పెరిగేకొద్దీ గ్రామానికి ముంపు సమస్య పెరుగుతుంది. రెండు రోజులుగా వర్షం తగ్గడంతో పరిస్థితి కొంత మెరుగైనా, ఎగువ ప్రాంతాల్లోని వరదనీరు ఎర్రకాలువకు చేరడంతో నీటి ప్రవాహం పెరుగుతోంది. ముంపు సమస్య నుంచి శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ముంపు ప్రాంతాల పరిశీలన

భీమడోలు: వర్షాలకు వరి నాట్లు దెబ్బతింటే తక్కువ కాల పరిమిత గల వరి రకాలను సాగు చేసుకుని, సాగు ఖర్చును తగ్గించుకోవాలని గుంటూరు ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం, లా ఫార్మ్ పరిశోధన సంచాలకులు డాక్టర్ పీవీ సత్యనారాయణ అన్నారు. గుండుగొలను శివారు కోరుకల్లు ప్రాంతంలో ముంపు బారిన పడిన వరి పొలాలను మంగళవారం ఏలూరు ఏరువాక సమన్వయకర్త, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కె.పణికుమార్, భీమడోలు ఏడీఏ డాక్టర్ పి.ఉషారాజకుమారి తదితర వ్యవసాయాధికారుల బృందంతో కలిసి పీవీ సత్యనారాయణ పరిశీలించారు. నారుమడి దశలో ఐదు సెంట్ల నారుమడికి కిలో యూరియా, కిలో పొటాష్ వేసుకోవాలన్నారు. వరి పిలకలు తొడిగే దశలో ఎకరాకు 10 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్ చల్లాలన్నారు. తెగుళ్ల సోకకుండా లీటర్ నీటికి గ్రాము కార్బెండజిమ్ లేదా రెండు గ్రాముల మాంకోజెబ్‌ను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. పొలం, నారుమడులు మునిగితే 125 రోజుల తక్కువకాల పరిమితి గల వరి వంగడాలను ఎంటీయూ, 1153, 1156, 1210, 1293, 1290 వరి రకాలను సాగు చేసుకోవాలన్నారు. తరచుగా ముంపునకు గురైయ్యే ప్రాంతాల్లో ఎంటీయూ 1232, 1140 వంటి మధ్యస్థ కాల పరిమితి వరి రకాలను సాగు చేసుకోవాలన్నారు.